ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 18 సెప్టెంబరు 2025



ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెద్దపల్లికల్చరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన యజ్ఞ మహోత్సవ్ విరాట్ విశ్వకర్మ ఉత్సవ వేడుకల్లో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఓబేదుల్లా, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు, కలెక్టర్ కోయశ్రీహర్ష, అదనపు కలెక్టర్ వేణు, అరుణశ్రీలతో కలిసి పాల్గొన్నారు. వారు విశ్వకర్మ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పూజలు చేశారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ విశ్వకర్మ ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నామని, విశ్వకర్మ దైవ రూపంగా, ఆధ్యాత్మికతతో, భక్తిశ్రద్ధలతో, ఉత్సవాలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. పూర్వకాలంలో అద్భుతమైన నైపుణ్యంతో విరాట్ విశ్వకర్మ వంటి మహనీయులు ఉన్నారని, మన భవిష్యత్ తరాలు తెలుసుకోవాలని, అందుకు ఇలాంటి ఉత్సవాలు దోహదపడుతాయని అన్నారు. విశ్వకర్మసంఘ నేతలు మాట్లాడుతూ అధికారికంగా విశ్వకర్మ ఉత్సవాలను నిర్వహిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వకర్మజయంతి రోజున ప్రభుత్వం అధికారిక సెలవుగా ప్రకటించాలని వారు కోరారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రంగారెడ్డి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఐబీ రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేస్తాం



పట్టణ అభివృద్ధి పనులపై నాయకులు, వ్యాపారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు త్వరలో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే విజయరమణరావు అన్నారు. పట్టణంలో జరుగుతున్న పనులను బుధవారం పరిశీలించారు. అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను సమకూర్చి రోడ్డు విస్తరణలో భాగంగా ప్రస్తుతం ఉన్న ఆర్‌అండ్‌బీ గదులను కూల్చివేసి వాటి స్థానంలో కొత్తగా రూ.65 లక్షలతో చేపట్టిన గదుల నిర్మాణ పనులను, సుల్తానాబాద్ నుండి పూసల రోడ్డు సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఐబీ చౌరస్తా నుంచి శాంతినగర్ చౌరస్తా వరకు రోడ్డు వెడల్పు నిర్మాణ పనులను పరిశీలించారు. గదుల నిర్మాణం పూర్తయిన తర్వాతనే ముందున్న దుకాణాలను కూల్చివేయాలని అధికారులను ఆదేశించారు. నెల రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, శ్రీగిరి శ్రీనివాస్, సాయిరి మహేందర్, మార్కెట్ డైరెక్టర్లు ఇల్లెందుల శ్రీనివాస్ గౌడ్, అమినోద్దిన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బయ్య గౌడ్, మండల అధ్యక్షుడు చిలుక సతీష్, దన్నాయక దామోదర్ రావు, మున్సిపల్ కమిషనర్ రమేష్, నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



సేవలను ప్రారంభిస్తున్న ఎంపీ

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) మహిళల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం స్వస్థనారీ, సాశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి ప్రారంభించారు. వంశీకృష్ణ మాట్లాడుతూ, ఇల్లు బాగుండాలంటే మహిళలు వారి ఆరోగ్యం బాగుండాలన్నారు. మహిళల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించకుండా కేంద్రప్రభుత్వ పథకాన్ని వినియోగించుకుంటూ వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య క్యాంపులో హెల్త్ చెక్ అప్ చేసుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ జరిగిన మహిళలకు సంబంధిత చికిత్సను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారని, కుటుంబంలో మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందనే ఉద్దేశంతో అమలు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక వైద్యుల సేవలు వినియోగంలో ఉన్నాయన్నారు. మహిళలు తమకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని కలెక్టర్ కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ కృష్ణ

జ్యోతినగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై రామగుండం ప్రాజెక్టు స్థాయి అంగన్‌వాడీ టీచర్లకు బుధవారం అవగాహన కల్పించారు. ఎన్టీపీసీ ఈడీసీ మిలీనియం హాలులో గోదావరిఖని సైబర్ క్రైం విభాగం ఎస్‌ఐ కృష్ణ అంగన్‌వాడీ టీచర్లకు సైబర్ మోసాలు, ఆన్‌లైన్ నేరాలకు సంబంధించి వివరించారు. రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, అత్యాశకు పోయి ప్రజలు మోసాలకు గురవుతున్నారన్నారు. అంగన్‌వాడీ జిల్లా కోఆర్డినేటర్ అనిల్, సీడీపీవో అలేఖ్య పటేల్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

- దశల వారీగా అభయహస్తం గ్యారెంటీ పథకాల అమలు
- జిల్లాలో కొత్తగా 12,168 కుటుంబాలకు రేషన్ కార్డుల జారీ
- పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి డీపీఆర్ తయారీకి కృషి
- ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌తో సామాజిక తెలంగాణ సాధనకు కృషి
- తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఓబేదుల్లా కొత్వాల్ సాహెబ్



జాతీయ పతాకానికి వందనం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రసంగిస్తున్న రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఓబేదుల్లా కొత్వాల్ సాహెబ్

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్రంలో అభివృద్ధి, పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన కొనసాగుతున్నదని, జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, ప్రజలు, అధికారులు కృషి చేస్తున్నారని రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఓబేదుల్లా కొత్వాల్ సాహెబ్ అన్నారు. బుధవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కొత్వాల్ సాహెబ్ జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడే నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు అభయహస్తం



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఓబేదుల్లా కొత్వాల్ సాహెబ్

ఆరు గ్యారెంటీ పథకాలను దశల వారీగా అమలు చేస్తున్నామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. పేదల ఆత్మ గౌరవానికి ప్రతీక అయిన రేషన్ కార్డులను అర్హులైన పేద కుటుంబాల అందరికీ మంజూరు చేస్తున్నామన్నారు. జిల్లాలో కొత్తగా 12,168 కుటుంబాలకు రేషన్‌కార్డులను జారీ చేశామన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు.

● ఆసుపత్రుల అభివృద్ధికి నిధులు..

జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల అప్‌గ్రేడ్ చేసి కార్పొరేట్‌కు దీటుగా వైద్యం అందించేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు నిధులను మంజూరు చేసిందన్నారు. గోదావరిఖని జనరల్ ఆసుపత్రి 160 కోట్లతో నిర్మాణం జరుగుతుందన్నారు. జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో 173 కోట్లు ఖర్చు చేస్తూ సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, బీటీ రోడ్లు, శ్మశాన వాటికలు ఇంటిగ్రేటెడ్ మార్కెట్, పురపాలక భవనం, డంప్

(మిగతా 8వ పేజీలో)

● ఉగాది నుంచి సన్న బియ్యం..

ప్రజా పంపిణీ ద్వారా ఇస్తున్న దొడ్డు రకం రేషన్ బియ్యాన్ని ప్రజలు తినకుండా, పక్కదారి పట్టిస్తున్నారని భావించిన ప్రజా ప్రభుత్వం పేద ప్రజల కడుపు నింపేందుకు ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిందన్నారు. కాకతీయ కాలువ కింద ఉన్న 2 లక్షల 30 వేల ఆయకట్టు స్థిరీకరణ, 10 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగు నీరు అందించేందుకు శ్రీలక్ష్మీ నరసింహస్వామి పత్తిపాక రిజర్వాయర్‌ను 3 నుంచి 5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మాణానికి డీపీఆర్ తయారీకి కోటి 10 లక్షల రూపాయల మంజూరు చేశామన్నారు. 13,396 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ చేసే రామగుండం ఎత్తిపోతల పథకం పెండింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి నీటి పారుదల శాఖ మంత్రి చేతుల మీదుగా ప్రారంభించామని తెలిపారు.



బల్లార్షా - కాజీపేట సెక్షన్‌లో ఇంటర్ లాకింగ్ పనులు

నేడు, రేపు పలు రైళ్లు పూర్తిగా, కొన్ని పాక్షికంగా రద్దు

7

కమిషరేట్‌లో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

కోల్‌సిటీ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ప్రజా పాలనదినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ గౌరవవందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో తెలంగాణకు రాలేదని, ప్రజలు పోరాడి స్వాతంత్ర్యాన్ని సెప్టెంబర్ 17న సాధించుకున్నారన్నారు. నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా కొమురంభీం, చాకలి ఐలమ్మ వంటి ఎందరో యోధులు పోరాటాలు చేయగా అప్పటి ప్రధాని నెహ్రూ, హోం మంత్రి వల్లాభాయ్ పటేల్‌లు జనరల్ చౌదరి ఆధ్వర్యంలో సైనిక చర్య జరిపి తెలంగాణను భారత్‌లో విలీనం చేశారన్నారు. ఏసీపీ రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐ వామనమూర్తి, శ్రీనివాస్, మల్లేషం, సీఐలు ఇంద్రసేనారెడ్డి, ప్రసాద్‌రావు, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.



రామగుండం కమిషనరేట్‌లో జెండా వందనం చేస్తున్న సీపీ అంబర్ కిశోర్, అధికారులు

బీజేపీ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న బీజేపీ నాయకులు

సుల్తానాబాద్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సుల్తానాబాద్‌లో బీజేపీ నాయకులు బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవరెడ్డి ప్రారంభించారు. సేవా పక్వాడ్ అభియాన్‌లో భాగంగా బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లా కన్వీనర్ నల్ల మనోహర్ రెడ్డి, కో కన్వీనర్లు మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, కాసగోని నిర్మల, మండల కన్వీనర్లు ఉషన అన్వేష్ యాదవ్, ఎల్లెంకి రాజుల ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు.

జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి మాట్లాడుతూ మోదీ 75వ జన్మదినం సందర్భంగా 75 మంది రక్తం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. బీజేపీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు మీస అర్జున్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్ యాదవ్, కోశాధికారి రాజేంద్ర ప్రసాద్, నాయకులు లింగారెడ్డి, రఘుపతి రావు, చాతరాజు రమేష్, గుంటి కుమార్, మండల ప్రధాన కార్యదర్శులు కోట నాగేశ్వర్, సాయికిరణ్ పాల్గొన్నారు. అలాగే పూసాల రోడ్డులో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు నిర్వహిస్తూ జాతీయ పతాకాన్ని కందుల శ్రీనివాస్ ఆవిష్కరించారు.

శ్రీపాద ఎల్లంపల్లికి 4.81 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

7

ధర్మారం అభివృద్ధికి నిరంతర కృషి



అభివృద్ధి పనుల వివరాలను తెలియజేస్తున్న మంత్రి అడ్లూరి

ధర్మారం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండల అభివృద్ధికి చేస్తానని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని తెనుగువాడ నుంచి ఎండపల్లి క్రాస్ రోడ్డు వరకు నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణానికి 3 కోట్ల 20 లక్షలు కేటాయించినందుకు పంచాయతి శాఖ మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ మార్కెట్‌లో మరమ్మతులకు కోటి 68 లక్షలు మంజూరయ్యాయని, కోటి 40 లక్షలతో షెడ్డు నిర్మాణం, 28 లక్షలు లెవలింగ్‌కు ఉపయోగిస్తామని తెలిపారు. మరో 5 లక్షలతో ట్రాన్స్‌ఫార్మర్ నిర్మిస్తామని పేర్కొన్నారు. డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా మంజూరైన కోటి రూపాయలతో మేడారంలో 10 లక్షలతో మహిళా సంఘం భవనంతోపాటు 15 గ్రామాలలో కమ్యునిటీ భవనాలు, సీసీ రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. మండలంలోని ఎర్రగుంటపల్లిలో 40 కోట్లతో నిర్మించబోయే ఐటీఐ కళాశాలను అత్యాధునికంగా తీర్చిదిద్దుతామన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా పత్తిపాకలో లక్ష్మీనర్సింహస్వామి ప్రాజెక్టుతోపాటు పెండింగ్‌లో ఉన్న బొమ్మరెడ్డిపల్లి, మేడారం రిజర్వాయర్ నుంచి నీటిని తరలించే కాలువలను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. 2027జరిగే గోదావరిపుష్కరాల ఏర్పాటు పనులను మొదలు పెట్టామని, గత ప్రభుత్వంలో పుష్కరాలు జరుగుతుంటే పనులు చేసేవారని ఎద్దేవా చేశారు. ప్రమాదంలో మరణించిన హమాలీ రాజేశంకు వ్యవసాయ మార్కెట్ తరుపున లక్ష రూపాయల చెక్కును అతని భార్య రాజేశ్వరికి అందజేశారు.

మార్కెట్ ప్రాంగణంలో జరుగుతున్న విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. మంత్రి అడ్లూరిని సంఘ నాయకులు సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, వైస్ చైర్మెన్ అరెగె లింగయ్య, సెక్రెటరీ సరోజ, మాజీ మార్కెట్ చైర్మెన్ కొత్త నర్సింహులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాడె సూర్యనారాయణ, పాలకుర్తి రాజేశం, ఓరెం చిరంజీవి, కాంసాని ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమైక్యతా దినోత్సవం



జెండా ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు చందర్, దాసరి మనోహర్ రెడ్డి

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని రాఘవాపూర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి జెండా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 17 అంటే తెలంగాణ ప్రజలకు విముక్తి పొందిన దినమని, హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందని వివరించారు. ఆనాటి రజాకార్ల దౌర్జన్యాలను, నిజాం నవాబు లొంగుబాటు తదితర అంశాలపై నాయకులు మననం చేసుకున్నారు. పట్టణ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ వైస్ చైర్మన్ మోబిన్, మాజీ కౌన్సిలర్ పూదరి చంద్రశేఖర్, శ్రీధర్, రమాదేవి, కార్యకర్తలు జావెద్, వెన్నం రవీందర్, మధు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లను బ్లాక్‌మెయిల్ చేస్తే సహించేది లేదు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టర్లను కొందరు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, వారి చర్యలను సహించేది లేదని కాంట్రాక్టర్లు హెచ్చరించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో కాంట్రాక్టర్లు కృపాకర్‌రావు, విశ్వతేజ, కుర్మ శ్రీనివాస్, కోడూరి రవి తదితరులు మాట్లాడారు. నాలుగేళ్లుగా కాంట్రాక్టర్లకు పనులు లేవని, చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామన్నారు. పెద్దపనులన్నింటిని హైదరాబాద్, వరంగల్, ఇతర ప్రాంతాల కాంట్రాక్టర్లు అంచనాలపై 5శాతం అధిక రేటు దాఖలు చేసి తీసుకుంటున్నారని, పదేళ్లుగా ఇతర ప్రాంతాల కాంట్రాక్టర్లే రామగుండంలో పనులు చేస్తున్నారన్నారు. వారు కూడా బిల్లులు రావడం లేదని పనులను మధ్యలోనే వదిలిపెట్టి వెళ్లిపోయారన్నారు. కార్పొరేషన్‌పై ఆధారపడి 200కాంట్రాక్టర్ల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, తమకు పనులు లేవని కలెక్టర్, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌లకు మొర పెట్టుకున్నామన్నారు. ఆన్‌లైన్ టెండర్లలో అంచనాలపై తక్కువ రేటుపై తాము టెండర్లు దాఖలు చేశామని, ఆన్‌లైన్ టెండర్లలో అన్నీ ప్రాంతాల వారు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంట్రాక్టర్లు

టెండర్లు వేసేందుకు అవకాశం ఉందన్నారు. తాము లెస్ టెండర్లు వేస్తే రింగ్ అయ్యామని, ఖజానాకు గండికొట్టామని, కోట్ల రూపాయలు వసూలు చేశామంటూ మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలత, ఆమె భర్త రాజు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. గతంలో వీరు కార్పొరేటర్‌గా పని చేసిన సమయంలో 4శాతం కమీషన్ ఇవ్వనిదే పనులు చేయనివ్వలేదని ఆరోపించారు.

5శాతం ఎక్సెస్ టెండర్లు ఇచ్చేందుకు నిబంధనలే ఉన్నాయని, పెద్ద పనులకు ఎక్సెస్ టెండర్లు ఇస్తున్నారన్నారు. కాంట్రాక్టర్లుగా తాము అంచనాల ప్రకారమే టెండర్లు దాఖలు చేశామే తప్ప అంచనాలు మార్చే పరిస్థితి ఉండదన్నారు. కాంట్రా క్టర్లలో అన్నీ పార్టీలు, అన్నీ వర్గాలకు చెందిన వారు ఉన్నారని, అధికార పార్టీతో సంబంధం లేదన్నారు. తమపై అబద్ధపు ఆరోపణలు చేసే వారిపై కేసులు పెడతామని, పరువునష్టం దావా కూడా వేస్తామన్నారు. విలేక రుల సమావేశంలో నగరపాలక సంస్థ కాంట్రాక్టర్లు రజినికాంత్, దాసరి సాంబమూర్తి, సదానందం, ప్రతాప్‌రెడ్డి, శశికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

● పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్యాయత్నం


శ్రీదేవి(ఫైల్)


చికిత్స పొందుతున్న దిడ్డి సుధాకర్

జమ్మికుంట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణానికి చెందిన దిడ్డి శ్రీదేవి(53) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా ఆమె భర్త దిడ్డి సుధాకర్ ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంటకు చెందిన దిడ్డి సుధాకర్-శ్రీదేవి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరు పిల్లలు వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. జమ్మికుంట నగరపంచాయతీగా ఉన్న సమయంలో 2006-2011వరకు శ్రీదేవి వార్డు సభ్యురాలిగా పని చేశారు. 2014లో ఆమె భర్త సుధాకర్ జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికై 2019వరకు పని చేశారు. సుధాకర్‌కు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. ఈ విషయంలో దంపతులిద్దరి మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున శ్రీదేవి మృతిచెందింది. శ్రీదేవి తల్లిదండ్రులు, సోదరులకు సుధాకర్ ఫోన్‌చేసి శ్రీదేవి గుండెపోటుతో మృతి చెందిందని తెలిపాడు. వారు వచ్చేలోపు సుధాకర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సుధాకర్‌ను చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శ్రీదేవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీదేవి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో బుధవారం గాలి పృథ్వీరాజ్(40) తన ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కరీంనగర్ రూరల్ సీఐ ఎ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పృథ్వీరాజ్ కొద్ది రోజుల క్రితం భార్యతో విడాకులు తీసుకున్నాడు. ఈ విషయంలో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి తండ్రి ఎల్లయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక మహిళ బలవన్మరణం


లచ్చవ్వ(ఫైల్)

చందుర్తి సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన న్యాత లచ్చవ్వ(52) కొద్దిరోజులుగా కడుపునొప్పి బాధపడుతోంది. ఆస్ప త్రులు తిరిగినప్పటికీ నయం కాకపోవడంతో, తన ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని లహరి గ్రాండ్ ఫంక్షన్ హాల్ వద్ద ఓ 55 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. బుధవారం ఇతని మృతదేహాన్ని చుట్టుపక్కల వారు చూసి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఈ మేరకు నశం రంగు చొక్కా, సిమెంట్ రంగు ప్యాంటు ధరించి చామనచాయ కలిగిఉన్న వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు మార్చూరికి తరలించి భద్రపరిచారు. ఆచూకీ తెలిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని టౌన్ సీఐ క్రిష్ణ తెలిపారు.

ఎన్నాళ్లకు..

● ఆర్నకొండ-మల్యాల రోడ్డుకు మహర్దశ
● సీఆర్ఐఎఫ్ కింద రూ. 50 కోట్ల నిధులు మంజూరు
● నియోజకవర్గ కేంద్రానికి వారధి


గోపాలరావుపేటలో రోడ్డుపై గుంతలు


చొప్పదండి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రానికి వారధిగా నిలిచే ఆర్నకొండ-మల్యాల రోడ్డు పూర్తిగా గ్రామీణ ప్రాంతానికే పరిమితమైంది. రెండు జిల్లాల పరిధిలోని నాలుగు మండలాల్లోని 15 గ్రామాల మీదుగా 35 కిలోమీటర్లు సాగే ఈ రోడ్డుపై ప్రతి నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. నాలుగు మండలాల ప్రజలకు వారధిగా నిలుస్తున్న ఆర్నకొండ-మల్యాల రోడ్డుకు మహర్దశ పట్టనుంది. కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరుకాగా దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగనున్నాయి. దాదాపు 50 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం మం జూరు చేయగా చొప్పదండి, రామడుగు, గంగాధర, మల్యాల మండలాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. ఆర్నకొండ నుంచి మల్యాల వరకు ప్రస్తుతం ఉన్న సింగిల్ రోడ్డును ఈ నిధులతో డబుల్ రోడ్డుగా మార్చనున్నారు. రాయపట్నం రహదారిలోని ఆర్నకొండ నుంచి గోపాల్‌రావుపేట, బూరుగుపల్లి, మల్యాల క్రాస్ రోడ్ వరకు ఈ డబుల్ రోడ్డు నిర్మాణం కానుండగా జగిత్యాల జిల్లాకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. అనేక గ్రామాల ప్రజలకు ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడనుంది. పూర్తిగా గ్రామీ ణ ప్రాంతాల నుంచి వెళ్లే ఈరోడ్డు రెండు జిల్లాల పరిధిలోకి వస్తుంది. ఈరోడ్డంతా భాగం చొప్పదండి నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. రాయపట్నం రహదారిని జగిత్యాల-వరంగల్ జాతీయ రహదారికి ఈ రోడ్డు అనుసంధానం చేస్తుంది.

గతంలో నిధులు మంజూరైనా..

ఆర్నకొండ నుంచి మల్యాల క్రాస్ రోడ్డు వరకు మరమతుల కోసం రెండేళ్ల క్రితం నిధులు మంజూరైనా పనులు చేపట్టలేదు. ఆర్నకొండ నుంచి గోపాలరావుపేట, గోపాలరావుపేట నుంచి బూరుగు పల్లి వరకు అక్కడి నుంచి మల్యాల వరకు రోడ్డును మూడు బిట్లుగా విభజించారు. పనులు మొదలయ్యే క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచి పోయాయి. తిరిగి ఇప్పటి వరకు కనీస మరమతులు చేపట్టలేదు. వర్షాలకు రోడ్డు దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్నకొండ నుంచి రాగం పేట, రెవెల్లి, గోపాల్‌రావుపేట అక్కడి నుంచి మల్యా ల వరకు ప్రతి నిత్యం వందలాది మంది ప్రజలు ఈ రోడ్డుపై ప్రయాణాలు చేస్తుంటారు.

తొలగనున్న ఇబ్బందులు

ఆర్నకొండ వద్ద రాయపట్నం రహదారి నుంచి ప్రారంభమయ్యే ఈరోడ్డు రాగంపేట, రేవెల్లి, పెద్దకుర్మపల్లి, రామడుగు మండలం గోపాలరావుపేట నుంచి గంగాధర మండలం సర్వారెడ్డిపల్లె, బూరుగుపల్లి,ర్యాలపల్లి, మల్యాల ఎక్స్ రోడ్డు వరకు ఉంటుంది. పదుల సంఖ్యలో గ్రామాల ప్రజలు ప్రతి నిత్యం ఈ రోడ్డు వెంట రాకపోకలు కొనసాగిస్తుంటారు. ప్రస్తుతం ఉన్న సింగిల్ రోడ్డు పూర్తిగా దెబ్బతిని బురదమయంగా మారింది. ఈ నేపధ్యంలో ఆర్నకొండ-మల్యాల రోడ్డుకు కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు కాగా దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగనున్నాయి. సింగిల్ రోడ్డు డబుల్ రోడ్డుగా మారనుండగా ఈ ప్రాంత ప్రజల కల నెరవేరనుంది.


ఆర్నకొండలో బురదమయంగా రోడ్డు


సర్వారెడ్డిపల్లెలో గుంతల రోడ్డు


రాగంపేటలో రోడ్డుపై గుంత

తల్లిని పట్టించుకోని కొడుకులపై అధికారుల విచారణ

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుకులగిద్దె గ్రామానికి చెందిన ములుగు రాజమ్మ.. కొడుకులు తన ఆలనపాలన చూసుకోవడం లేదంటూ గతంలో ఆర్డీవోకు ఫిర్యాదు చేసింది. దీంతో ముగ్గురు కుమారులను పిలిపించి ఒక్కొక్కరూ నెలకు రూ.3వేల చొప్పున తల్లిపోషణ నిమిత్తం ఇవ్వాలని ఇటీవల ఆదేశాలు జారీచేశారు. ఈ ఆదేశాలు సరిగా అమలు జరుగుతున్నాయో లేదా అని తెలుసుకోవడానికి జిల్లా కలెక్టర్, జిల్లా సంక్షేమ అధికారి ఆధ్వర్యంలోని ఒకబృందం బుధవారం విచారణ చేపట్టింది. విచారణలో రాజమ్మను కుమారులు పట్టించుకోవడం లేదని నిర్ధారణ అయింది. ఈమేరకు ముగ్గురు కుమారులకు అధికారులు మరోసారి కౌన్సెలింగ్ ఇచ్చారు. రాజమ్మను పట్టించుకోకపోతే చట్టపర మైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విచారణలో సోషల్ కౌన్సిలర్ పద్మావత, డీపీసీ కౌన్సిలర్ ఆరే శేఖర్, ఎఫ్ఆర్‌వో రఫీ, హెడ్ కానిస్టేబుల్ మధు, మల్లయ్య, మర్రి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఐ గోదాంలో బుధవారం లారీ ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన అబ్జల్ బేగం(58) గోదాంలో పనిచేస్తుంది. గోదాంలో లారీరివర్స్ తీస్తుండగా వెనుక ఉన్న మహిళను గమనించని డ్రైవర్ ఆమెను ఢీకొట్టాడు. దీంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. కూతురు పర్‌వీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. డ్రైవర్ బురుగు సతీష్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు.

రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌కు హైకోర్టు వారెంట్

తంగళ్లపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మధ్య మానేరు నిర్వాసితుడికి నష్టపరిహారం చెల్లించాలని హైకోర్టు వెల్లడించిన తీర్పును నిర్లక్ష్యం చేయడంతో పాటు కోర్టుకు హాజరుకాని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూకు హైకోర్టు వారెంట్ జారీ చేసినట్లు పిటిషనరు తరపు న్యాయవాది బొమ్మెన అర్జున్‌రావు తెలిపారు. న్యాయవాది తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన మధ్య మానేరు నిర్వాసితుడు వేల్పుల ఎల్లయ్య ప్రాజెక్టులో తన ఇంటిని కోల్పోయాడు. ఇంటికి అధికారులు నష్ట పరిహారం చెల్లించడంలేదని ఎల్లయ్య హైకోర్టును ఆశ్రయించాడు. ఎల్లయ్యకు పరిహారం చెల్లించాలని హైకోర్టు 2025జూన్‌లో తీర్పు వెల్లడించింది. కలెక్టర్ పరిహారం చెల్లించకుండా కోర్టుకు హాజరు కావడం లేదని తెలిపారు. బుధవారం కోర్టుకు హాజరుకావాల్సి ఉండగా, గైర్హాజరు కావడమే కాకుండా ఎలాంటి సమాధానం రాకపోవడంతో న్యాయమూర్తి కలెక్టర్‌కు వారెంట్ జారీచేసినట్లు పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. కాగా బాధితుడు మధ్యమానేరు నిర్వాసితుడు ఎల్లయ్య మాట్లాడుతూ 2013 నుంచి పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా నిర్లక్ష్యం వహించారని తెలిపాడు. తనకు నష్టపరిహారం రూ.7,07,808 వస్తాయని అధికారులు ప్రకటించి పరిహారం చెల్లించకుండా నిర్లక్ష్యం వహించడంతో కోర్టును ఆశ్రయించినట్లు తెలిపాడు. పరిహారం చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చినా చెల్లించకపోవడంతో కలెక్టర్‌కు వారెంట్ జారీ అయినట్లు న్యాయవాది తెలిపారని పేర్కొన్నాడు.

గిరిజన తండాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం కంచర్ల, గోల్యానాయక్‌తండా, రాశిగుట్టతండాలో ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. సారా తయారీ కేంద్రాలను కనుగొన్నారు. నిల్వ చేసిన 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. రవాణాకు సిద్ధంగా ఉన్న 8 లీటర్ల సారా ప్యాకెట్లను స్వాధీనపర్చుకున్నారు. ముగ్గురు సారా తయారీదారులను తహసీల్దార్ ముక్తర్ పాషా ఎదుట హాజరుపరిచామని సీఐ పేర్కొన్నారు. దాడుల్లో సిబ్బంది రాజేందర్, మల్లేశ్, కిశోర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

భూక్యతండాలో పోలీసుల తనిఖీలు

వీర్నపల్లి మండలం భూక్య తండాలో ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. సారా తయారుచేస్తున్నారనే సమాచారంతో తండాలోని పలు ఇళ్లలో సోదాలు జరిపారు. సారా తయారీకి వినియోగించే పాత్రలు లభించాయని ఎస్ఐ పేర్కొన్నారు.

రవాణా శాఖ విజిలెన్స్ అధికారుల ప్రత్యేక తనిఖీలు


ఎల్లారెడ్డిపేటలో వాహన తనిఖీలను నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రధాన రహదారులపై హైదరాబాద్‌లోని రవాణాశాఖ విజిలెన్స్ అధికారులు, సిరిసిల్ల ఎంవీఐ అధికారులు బుధవారం ప్రత్యేక వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ప్రధాన రహదారులపై ప్రయాణిస్తున్న ప్రతి వాహానాన్ని ఆపి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఎలాంటి పత్రాలు లేని 10వాహానాలను సీజ్ చేశామని ఎంవీఐ వంశీధర్ పేర్కొన్నారు. విజిలెన్స్ అధికారులు మనోజ్‌కుమార్, గ్రేగర్‌జాన్, ఎంవీఐ వంశీధర్, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి ఆర్టీసీ కార్మికుల సమస్యలు

● ఎస్‌డబ్ల్యూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహమూద్


మాట్లాడుతున్న ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూసీ (ఐఎన్‌టీసీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహమూద్

భగత్‌నగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా ప్రయత్నిస్తానని ఎస్‌డబ్ల్యుసి (టిఎన్‌టిసి) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహమూద్ అన్నారు. బుధవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో టీజీఆర్టీసీ ఎస్‌డబ్ల్యుఎస్ (ఐఎన్‌టిసి) రీజియన్ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైస్ ఛైర్మన్ అబ్రహం, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ జక్కుల మల్లేశం గౌడ్, రాష్ట్ర నాయకులు మహేందర్, కేఆర్‌రెడ్డి, సంపత్, సాగర్, కొమురయ్య, రీజియన్ కార్యదర్శి టిఆర్‌రెడ్డి, అధ్యక్షుడు ఎన్‌కె రాజు, రీజియన్‌లోని వివిధ డిపోల కార్మికులు పాల్గొన్నారు.

విషాహారం తిని వీధి కుక్కలు మృతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కట్టరాంపూర్, మహాలక్ష్మినగర్‌లో ఐదు వీధికుక్కలు విషాహారం తిని మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి సమయంలో విషాహారం పెట్టడంతో ఆ ఆహారంతిని కుక్కలు మృతిచెందాయని తెలిపారు. మృతిచెందిన ఐదుకుక్కలను బుధవారం ఉదయం మున్సిపల్ సిబ్బంది డంపుయార్డుకు తరలించారు. బ్లూక్రాస్ ప్రతినిధులు విషాహారం పెట్టి కుక్కలను చంపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కరీంనగర్ ఒకటోఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మూడు ఇళ్లలో చోరీ

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలోని హరిహర కాలనీలో తాళంవేసిన మూడు ఇళ్లలో మంగళవారం రాత్రిచోరీ జరిగింది. దొంగలు మూడు ఇళ్లల్లో తాళాలు పగులగొట్టి రెండు తులాల బంగారు ఆభరణాలతో పాటు విలువైనవస్తువులు అపహరించుకు వెళ్లారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు పట్టణపోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తెగిన దుంపెట ఊర చెరువు

● నీట మునిగిన 180 ఎకరాల పంటలు ● దూలూరు-కథలాపూర్‌కు నిలిచిన రాకపోకలు


దుంపెట చెరువు తెగి వృథాగా పోతున్న నీరు


భవనంపై నుంచి తెగిన చెరువును పరిశీలిస్తున్న ఎస్సై, ఇరిగేషన్ ఏఈ

కథలాపూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం దుంపెట గ్రామ ఊర చెరువు బుధవారం సాయంత్రం తెగిపోయింది. దీంతో 180ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. దుంపెట గ్రామ శివారులో ఉన్న ఊరచెరువు ఒక్కసారిగా తెగి భారీ శబ్దం రావడంతో గ్రామస్తులు ఉలిక్కి పడ్డారు. రెండేళ్ల క్రితంకూడా చెరువు తెగిపోగా ఇరిగేషన్ అధికారులు రూ.6లక్షల నిధులతో మట్టిపోసి గండిని పూడ్చివేశారు. మళ్లీ అదే ప్రాంతంలో తెగిపోవడంతో పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. మూడురోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో ఎగువప్రాంతం నుంచి భారీగావరద చేరుతోంది. ప్రవాహం దాటికి మరమ్మతు చేసిన ప్రాంతంలో మట్టి కుంగిపోయి భారీ గండి పడిందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. చెరువు తెగిపోవడంతో కథలాపూర్ మండలం దుంపెటకు చెందిన 80 ఎకరాలు, దూలూరుకు చెందిన వంద ఎకరాల్లో పసుపు, వరి, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. చెరువు తెగడంతో దూలూరు శివారులో ఒర్రె ఉధృతంగా ప్రవహించడంతో అధికారులు రాకపోకలను నిలిపివేయించారు. తహసీల్దార్ వినోద్, ఎస్సై నవీన్, ఆర్ఐ నగేశ్, ఇరిగేషన్ ఏఈ నవీన్ తెగిన చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. చేతికొచ్చిన మొక్కజొన్న పంటల నుంచి నీరు వెళ్తుండడంతో తడిచి రంగు మారి పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. పంట పొలాల నుంచి నీరంతా పారుతుండడంతో ఇసుక మేటలు పెట్టి పంటలు పూర్తి దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● రూ.3 లక్షల విలువైన చేప పిల్లలు నీటిపాలు..

గంగపుత్రులు ఊర చెరువులో ఇటీవలే రూ.3 లక్షల విలువైన చేప పిల్లలను వదిలారు. చెరువు తెగిపోవడంతో చేప పిల్లలు నీటిపాలయ్యాయని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సైదాపూర్‌లో నాకాబందీ

● 69పాత చలాన్‌ల ద్వారా రూ.19,695 వసూల్

సైదాపూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించి నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రంకెన్‌డ్రైవ్‌తో పాటు పత్రాలు సక్రమంగా లేని, నెంబర్‌ప్లేట్ లేని వాహనాలకు జరిమానాలు విదించారు. పాత బకాయి చలాన్లను కట్టించారు. మొత్తం రెండు డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేయగా 59పాత బకాయి చలాన్ల ద్వారా రూ.19,695లు కట్టించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో రూరల్‌సీఐ పులి వెంకట్, శంకరపట్నం, హుజూరాబాద్ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, స్పెషల్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులకు పతకాలు


పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులతో అధికారులు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలను సాధించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఈ నెల 12నుంచి 14 తేదీ వరకు జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా చొప్పదండి మండలానికి చెందిన విద్యార్థులు పాల్గొని ఆరు బంగారు, ఆరు రజత, ఎనిమిది కాంస్య పతకాలను సాధించారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీగాధ సంతోష్ తెలిపారు. అలాగే జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారులు మన్విత్, స్నికితా, హితీపవర్, అంజలీ, రమ్య, హైమావతి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను రాష్ట్ర తైక్వాండో సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి గంది సంతోష్, జిల్లా కోచ్‌లు సతీష్, రాజేందర్, కిరణ్, లహరి, శ్రీజ, నాగమణి తదితరులు అభినందించారు.

పెగడపల్లి తహసీల్దార్ సస్పెన్షన్

పెగడపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి తహసీల్దార్ బి.రవీందర్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల అర్బన్ హౌజింగ్ కాలనీ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ఈనెల12న విధులు నిర్వహిస్తూ ఒక మహిళా ఉద్యోగిని వేధింపులకు గురి చేయడంతో జగిత్యాల పోలీసులు కేసునమోదుచేసి రిమాండ్‌కు తరలించిన విషయం విదితమే. ఈ కేసులో జైలుకు వెళ్లిన రవీందర్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అనుమతి సమయం ముగిసినా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామ శివారులో పట్టుకున్నామని ఎస్ఐ లక్ష్మణ్ బుధవారం రాత్రి తెలిపారు. మండలంలోని లాల్‌సింగ్‌నాయక్‌తండాకు చెందిన రవాణాదారుడు భూక్య మోహన్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో భాషా పండితులను నియమించాలి


మాట్లాడుతున్న నాగుల భిక్షపతి

హుజూరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో భాషా పండితులను నియమించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు రాష్ట్ర కోశాధికారి నాగుల భిక్షపతి అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల్లో మండలశాఖ అధ్యక్షుడు ఉడుత సంపత్ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు, హిందీభాషలు ప్రాథమిక స్థాయిలో నిర్వీర్యం పరిస్థితి ఉన్నదన్నారు. మాతృభాషలో చాలామంది విద్యార్థులు ప్రావీణ్యం సాధించలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం తెలుగు మాధ్యమం ప్రాథమిక స్థాయిలో తొలగించినప్పటికీ భాషలపట్ల నైతికవిలువల విద్య బోధనకు పండితులను నియమించాలన్నారు. సమావేశంలో సంపత్, పవన్‌ప్రసాద్ శర్మ, ఉమాదేవి, తిరుపతమ్మ, సర్వర్‌మియా, చంటి, లక్ష్మణ్, మొగిలి, రమేష్‌బాబు, స్వాతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తేవాలంటూ భర్త, అతని కుటుంబ సభ్యులు వేధించడంతో పాటు బెదింపులకు పాల్పడిన అత్తింటి వారిపై ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... నగరానికి చెందిన మౌనికకు, సూర్యతేజకు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్నకానుకలు ముట్ట జెప్పారు. ఏడాది కాలంగా భర్త సూర్యతేజతో పాటు అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం తేవాలంటూ బెదిరింపులకు గురి చేస్తుండటంతో భరించలేక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు భర్తతో పాటు అత్తింటి వారిపై కేసు నమోదు చేశారు.

ఆరోగ్య శ్రీ సేవలు పునరుద్ధరించాలి

ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు మంత్రి పొన్నం విజ్ఞప్తి

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు మానవీయ కోణంలో ఆలోచించి ఆరోగ్య శ్రీ సేవలు పునరుద్ధరించాలని కరీంనగర్ జిల్లా ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడగానే ఆరోగ్యశ్రీ ఉచిత వైద్య పరిమితి ఐదు లక్షల నుంచి పది లక్షల పెంచడంతో పాటు గడిచిన 21 నెలలలో రాష్ట్ర వ్యాప్తంగా 1,779 కోట్ల రూపాయలను ఆరోగ్య శ్రీ కింద ప్రైవేట్ హాస్పిటల్‌లకు ప్రభుత్వం చెల్లించిందన్నారు. 1,375 వైద్య చికిత్సల చార్జీలను సగటున 22 శాతానికి పైగా పెంచామన్నారు.

కొత్తగా 163 రకాల ఖరీదైన వైద్య సేవలను ఆరోగ్యశ్రీలో చేర్చి పేదలకు ఇబ్బందులు లేకుండా మరిన్ని వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. కొత్త ప్యాకేజీల చేర్పుతో అదనంగా 487.29 కోట్ల రూపాయలు పేదలకు ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. 2014-23 నవంబరు వరకు సగటున నెలకు 57 కోట్ల రూపాయలు ఆసుపత్రులకు చెల్లించగా 2023 డిసెంబరు నుంచి 2024 డిసెంబరు వరకు సగటున 75 కోట్లు ప్రభుత్వం చెల్లించిందని మంత్రి తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నారన్నారు. ఇప్పటికే రెండు రోజుల్లోనే 100 కోట్లు ప్రైవేట్ ఆసుపత్రులకు విడుదల చేశామన్నారు. ఆ డబ్బులు ఆసుపత్రుల ఖాతాలో జమ య్యాయని, పెండింగ్ డబ్బులు విడ తల వారీగా చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు అర్థం చేసుకోవాలన్నారు.

నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు

కార్పొరేట్, మెడికల్ కళాశాలల్లో సేవలు యథాతథం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిలులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల అసోసియేషన్ పిలుపు మేరకు బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపి వేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రావలసిన బిల్లులు పెద్ద మొత్తంలో పెండింగ్‌లో ఉండడంతో దశల వారీగా బిల్లులు విడుదల చేయాలని ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేశాయి. పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడంతో బుధవారం నుంచి సేవలు నిలిపివేశారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 43 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉన్నాయి. అందులో కరీంనగర్‌లో-29, జగిత్యాల-10, రాజన్న సిరిసిల్ల-3 పెద్దపల్లి-1 ఉన్నాయి. మొత్తం దాదాపు రూ. 67 నుంచి రూ. 70 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. గత ప్రభుత్వం నెలకు రూ. 50 కోట్లు కూడా ఇవ్వలేదని, తాము నెలకు రూ. 100 కోట్లు ఇస్తామని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అసోసియేషన్ ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నట్లు అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. అయితే కార్పొరేట్ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీల్లో సేవలు కొనసాగుతున్నాయి.

ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించాలి



డాక్టర్ విష్ణువర్దన్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల బాధ్యుడు

చాలా రోజులుగా బిల్లులు పెండింగ్‌లో ఉండడం వల్ల ఆసుపత్రుల నిర్వహణ భారంగా మారింది. ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలి. ప్రజలకు వైద్యం అందించడంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

మగ్గంపై ప్రధాని చిత్రం

మోదీకి వినూత్నంగా శుభాకాంక్షలు



వస్త్రాలను చూపుతున్న హరిప్రసాద్

సిరిసిల్ల సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చేనేత మగ్గంపై ప్రధాని మోదీ చిత్ర పటాన్ని నేసి రాజన్న సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రానికి చెందిన హరిప్రసాద్ చేనేత పట్టు వస్త్రంపై రెండు విభిన్నమైన చిత్రాలను మగ్గంపై నేశాడు. మోదీ తన తల్లితో ముచ్చటించే దృశ్యాన్ని ఒక చిత్రంగానే నేస్తే, మరొకటి యోగ ముద్రలో ఉన్న చిత్రాన్ని నేసి ప్రదర్శించాడు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన కనగర్తి క్రీడాకారులు

ఓదెల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనగర్తి హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్, జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో క్రీడాకారులు దామరిషి చరణి 42కిలోల విభాగంలో, దొడ్డి కీర్తన 60 కిలోల విభాగం, వేల్పుల లక్ష్మి 64 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్స్ సాధించారు. విద్యార్థుల ఎంపికపై పీడీ విష్ణును, విద్యార్థులను ఎంఈఓ రమేష్, సిబ్బంది, గ్రామస్థులు అభినందించారు.

నేడు ఎస్సారార్‌లో చివరి విడత స్పాట్ అడ్మిషన్లు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దోస్త్ చివరి విడత స్పాట్ అడ్మిషన్స్ సెప్టెంబరు 18,19వ తేదీలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ, అడ్మిషన్ కమిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.సురేందర్‌రెడ్డి, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. లోకల్, నాన్ లోకల్ విద్యార్థులకు స్పాట్‌లో పాల్గొనే అవకాశం ఉంటుంది. బీఎస్సీ లైఫ్‌సైన్స్-19, బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్ -23, బీకామ్ రిటైల్ ఆపరేషన్స్-8, బీకాం ఫైనాన్స్- 3, బీకాం బిజినెస్ ఎనలిస్ట్-2, బీబీఏ-1, బీఏ ఇంగ్లీష్ మీడియం-1 మొత్తం 57 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు.

గదులు శిథిలం.. భయం..భయం..



వరండాలో కూర్చున్న విద్యార్థులు

- 190 మంది విద్యార్థులు.. ఐదు తరగతులు.. 4 గదులు..
- బడి గదిలోనే అంగన్‌వాడీ కేంద్రం..
- పట్టించుకోని అధికారులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని భావించిన తల్లిదండ్రులు బడిలో చేర్పించారు. మెరుగైన విద్యను బోధించేందుకు ఉపాధ్యాయులు ఉన్నా.. గదుల కొరత అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులను వేధిస్తోంది. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులు కొనసాగుతున్నాయి. 190 మంది విద్యార్థులకు కేవలం 4 గదులు మాత్రమే ఉన్నాయి. అందులోని ఓ గదిలోనే అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.

కేంద్రంలో 30 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. తరగతి గదులు సరిపోక పాఠశాల కార్యాలయంలో తరగతి గదిలో పాఠాలు చెప్పడంతో పాటు వరండాల్లో విద్యార్థులకు బోధిస్తున్నారు. ఉన్న తరగతి గదుల పైకప్పులు పెచ్చులూడుతున్నాయి. భారీ వర్షాలకు నీరు కారడం వల్ల బోధనకు ఆటంకంగా మారుతోంది. విద్యార్థుల భద్రత కరవవుతోంది. బడి భవనం శిథిలావస్థలకు చేరడంతో 2022లో అప్పటి ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి రూ.35.80 లక్షలు కేటాయించింది. నాలుగు తరగతి గదులను నిర్మించినా నిరుపయోగంగా మారింది. ఓ వైపు విద్యార్థులు శిథిలావస్థలకు చేరిన పాఠశాలలో అవస్థలు పడుతుంటే.. నూతన భవనంలోకి సంబంధిత శాఖ అధికారులు మార్చకపోవడంపై తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుల ఇబ్బందులు..

ప్రభుత్వ పాఠశాలలో సరిపడా తరగతి గదులు లేకపోవడం వల్ల విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయుల కార్యాలయంలో ఓ తరగతిని నిర్వహిస్తున్నారు. వరండాలో కూర్చొని పాఠాలు వినాల్సి వస్తోంది. వర్షానికి గదుల పైకప్పులు పెచ్చులూడడం వల్ల భయంభయంగా గడపాల్సి వస్తోంది. మరో వైపు ఓ గదిలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. అందులో 30 మంది చిన్నారులుండగా వస్తువుల నిల్వ, ఇతర సామగ్రి, వంట తయారు చేసేందుకు తంటాలు పడుతున్నారు. నూతన అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలకు ప్రభుత్వం 2024లో ఒక్కో భవనానికి రూ.12 లక్షలు మంజూరు చేసింది. పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల అటు పాఠశాల విద్యార్థులు.. ఇటు అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులకు ఇబ్బందులు తప్పడం లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సరిపడ తరగతుల్లో విద్యాబోధన సాగేలా చూడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఒకే గదిలో కొనసాగుతున్న బోధన, కార్యాలయం



పెచ్చులూడిన తరగతి గది పైకప్పు

నూతన భవనంలోకి మార్చేలా చర్యలు



కృష్ణహరి, ఎంఈవో

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల కొరత వల్ల మూడేళ్ల కిందట నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు పూర్తయ్యాయి. మిగిలిపోయిన చిన్నపాటి పనులను సకాలంలో పూర్తిచేసి నూతన పాఠశాల భవనంలోకి బడిని మార్చుతాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

ఇబ్బందులను తీర్చుతాం



లక్ష్మీరాజం, డీడబ్ల్యూఎస్‌వో

రాచర్లబొప్పాపూర్ గ్రామంలో చేపట్టిన నిర్మాణ పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటాం. పనులను సకాలంలో పూర్తిచేసి అంగన్‌వాడీ కేంద్రాలను నూతన భవనాల్లోకి తరలించేలా చూస్తాం. చిన్నారులకు అన్ని వసతులతో కూడిన కేంద్రాల్లో ఆటపాటలతో విద్యను అందించేందుకు పాటు పడుతాం.

జాతీయ జెండాను ఎగుర వేశారు.. అవనతం మరిచారు..



వీర్నపల్లిలో చీకటి పడినా ఎగురుతున్న జాతీయ పతాకం

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన వేడుకలను వీర్నపల్లి మండల కేంద్రంలో ఓ రాజకీయ పార్టీ నాయకులు బుధవారం ఎంతో ఆర్భాటంగా నిర్వహించారు. స్థానిక బస్టాండు ప్రాంతంలో ఆ పార్టీ నాయకులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాత్రి 9 గంటలు దాటినా అవనతం చేయడం మర్చిపోయారు.

బీఎస్సీ డిజైన్ టెక్నాలజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గత జూన్‌లో నిర్వహించిన బీఎస్సీ డిజైన్ టెక్నాలజీ ఐదవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి సురేష్ కుమార్ బుధవారం విడుదల చేశారు. ఈ పరీక్షల ఫలితాలు శాతవాహన వెబ్‌సైట్ www. satavahana. ac.inలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

కుంభమేళాగా గోదావరి పుష్కరాలు

దేవాదాయశాఖ కమిషనర్ శైలజ రామయ్యర్

వెల్గటూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాబోయే గోదావరి పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం దక్షిణ భారత కుంభమేళాగా నిర్వహిం చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు దేవాదాయశాఖ కమిషనర్ శైలజ రామయ్యర్ పేర్కొన్నారు. బుధవారం కోటిలింగాలలోని గోదావరి తీర ప్రాంతం, పుష్కర ఘాట్లను మంత్రి అడ్లూరి, కలెక్టర్ సత్యప్రసాద్‌లతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆమె 2027లో రాబోయే పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదిక కన ఏర్పాట్లు చేయడానికి ముందస్తు ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. పుష్కర స్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తుల రద్దీని అంచనా వేసుకుని మౌలిక వసతులు కల్పించాలన్నారు. అంతకు ముందు దేవాదాయ శాఖ కమిషనర్ శైలజ రామయ్యర్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లకు ఆలయ అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. శ్రీ కోటేశ్వర స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వారికి స్వామి వారి శేషవస్త్రం కప్పి ప్రసాదాలు అందజేశారు.



కోటిలింగాలలో పుష్కర ఘాట్లను పరిశీలిస్తున్న మంత్రి అడ్లూరి, దేవాదాయశాఖ కమిషనర్ శైలజ రామయ్యర్, జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్

పుష్కరాల నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

గోదావరి పుష్కరాల నిర్వహణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనా విధానంతో రెండున్నర సంవత్సరాల ముందు నుంచే ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. గోదావరి తీర ప్రాంతం బాసర సరస్వతి దేవి ఆలయం నుంచి మొదలుకొని, ధర్మపురి, కోటి లింగాల, కాళేశ్వరం, భద్రాచలం వరకు తెలంగాణ ప్రాంతంలోని ప్రతీ గోదావరి తీర దైవక్షేత్రాలను గొప్పగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు.

వంద సంవత్సరాల పాటు తలచుకునేలా మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని అడ్వైజర్‌ను కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీవో మధుసుధన్, ఆలయ ఈవో కాంతారెడ్డి, తహసీల్దార్ శేఖర్, ఏఎంసీ చైర్మన్ గోపిక జితేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేంధర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బల్లార్షా- కాజీపేట సెక్షన్‌లో ఇంటర్ లాకింగ్ పనులు

నేడు, రేపు పలు రైళ్లు పూర్తిగా, కొన్ని పాక్షికంగా రద్దు

పెద్దపల్లి, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): బల్లార్షా నుంచి కాజీపేట సెక్షన్‌లోని మందమర్రి నుంచి రామగుండం వరకు గల 24 కిలోమీటర్ల ట్రిపుల్ లైన్ మార్గంలో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థను అందు బాటులోకి తీసుకురావడానికి ఈ నెల 19న నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టనున్నారు. దీంతో 18, 19 తేదీల్లో పలు రైళ్ల పాక్షికంగా రద్దు కానున్నాయి. ఇప్పటికే కాజీపేట నుంచి బల్లార్షా సెక్షన్‌లోని హసన్‌పర్తి రోడ్డు నుంచి జమ్మి కుంట రైల్వే స్టేషన్ల మధ్య గల 24 కిలోమీటర్ల మేర దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థ ను అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఈ ఆటో మేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థ కారణంగా ఒకే మార్గంలో నడుస్తున్న ఒక రైలుకి, ఇంకొక రైలుకు మధ్య కేవలం ఒక కిలోమీటర్ మాత్రమే తేడా ఉంటుంది, ఇంతకు ముందు ఒకే మార్గంలో నడిచే రైళ్లు ఒకస్టేషన్ మధ్య తేడాతో నడవాల్సి వచ్చేది. ప్రస్తుతం ఈ సెక్షన్‌లో బ్లాక్ సిగ్నలింగ్ పనులు చకచకా సాగుతున్నాయి. త్వరలో ఈ సెక్షన్ మొత్తం ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థను పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఈ వ్యవస్థ పూర్తిగా వినియోగంలోకి వస్తే రైళ్ల ఆలస్యాన్ని నివారించడానికి దోహదపడుతుంది. ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా ఈ నెల 19వ తేదీన 17003/04 రామగిరి మెము ఎక్స్‌ప్రెస్, 17035/36 కాజీపేట నుంచి బల్లార్షా ఎక్స్‌ప్రెస్, కరీంనగర్ నుంచి సిర్పూర్ టౌన్ నుంచి కరీంనగర్ పుష్ పుల్ మెము ప్యాసింజర్ రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. 18వ తేదీన సికింద్రాబాద్ నుంచి బయలుదేరే 17234 భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, 19వ తేదీన సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి బయలుదేరే 17234 భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కేవలం సికింద్రాబాద్ నుంచి కాజీపేట మధ్య నడపడనున్నారు.

కాజీపేట నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు పాక్షికంగా రద్దు చేయనున్నారు. 17033/34 సింగరేణి మెము ఎక్స్‌ప్రెస్ రైలును భద్రాచలం రోడ్డు నుంచి వరంగల్ వరకు మాత్రమే నడపనున్నారు, వరంగల్ నుంచి బల్లార్షా మధ్య పాక్షికంగా రద్దు చేయనున్నారు. 17011/12 హైదరాబాదు నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి బీదర్ వరకు నడిచే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును 19వ తేదీన మందమర్రి రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ తొలగించారు. 07078 డెహ్రాడూన్ నుంచి చర్లపల్లి వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును అరగంట సేపు ఆలస్యంగా నడపనున్నారు. దీనిని ప్రయాణికులు గమనించాలని రైల్వే అధికారులు కోరారు.



కొత్త నరసింహస్వామి ఆలయ పునర్ నిర్మాణానికి కృషి

ధర్మపురి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో కొత్త నర సింహ స్వామి ఆలయం పునర్ నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం కార్యాలయం లో ఆలయ అభివృద్ధి పనులపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి పనుల గురించి శైలజ రామయ్యర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి విషయంలో ఆగమ శాస్త్రం, వాస్తు శాస్త్రం ప్రకారం కొత్త నరసింహస్వామి రీకన్‌స్ట్రక్షన్ చేయాలన్నారు. 2027 లో గోదావరి పుష్కర స్నానఘట్టాలను అభివృద్ధి కోసం ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. ప్రస్తుతం తయారు చేసిన మాస్టర్ ప్లాన్‌లో సవరణలు చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లత, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, దేవాదాయ శాఖ వైదిక సలహా దారు గోవింద హరి, స్థపతి వల్లినాగయం, ఎండోమెంట్ డిప్యూటీ కమీషనర్ సంధ్యారాణి, అసిస్టెంట్ కమిషనర్ నాయిని సుప్రియ, ఎండోమెంట్ ఎస్ఈ ఓంప్రకాష్, ఈఈ శ్రీనివాస్ శర్మ, రాజేష్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో రెవెన్యూ, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో రెవెన్యూ, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఎండోమెంట్ ఇన్‌చార్జి కమిషనర్ శైలజ రామయ్యర్ బుధవారం పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఆమెకు అర్చకులు, సిబ్బంది పూర్ణకుంభ స్వాగతం పలికారు.

శ్రీరాంసాగర్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో

జగిత్యాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):శ్రీరాంసాగర్‌కు బుధవారం ఇన్‌ఫ్లో పెరిగింది. 37 గేట్లు పైకి ఎత్తి 2,58,705 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 73.37 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద కాలువకు 6,735 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4,000, సరస్వతీ కాలువకు 800, లక్ష్మీ కాలువకు 200, అలీసాగర్‌కు 180 క్యూసెక్కులు విడుదల అవుతోంది.

శ్రీపాద ఎల్లంపల్లికి 4.81 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

పెద్దపల్లి: జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి బుధవారం సాయంత్రం వరకు 4,81,524 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. దీంతో గోదావరిలోకి 38 గేట్ల ద్వారా 4,88,142 క్యూసెక్కుల నీటిని వదిలి పెడుతున్నారు. ఎస్సారెస్పీ నుంచి 2,58,705 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 6,332 క్యూసెక్కులు, పరివాహక ప్రాంతం నుంచి 2,16,487 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 16.614 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. మంగళవారం రాత్రి 5 లక్షల క్యూసెక్కుల వరకు గోదావరిలోకి వదిలి పెట్టారు. ఈ నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

పార్వతి బ్యారేజీలో పెరిగిన వరద ఉధృతి

మంథనిరూరల్: మండలంలోని సిరిపురం సమీపంలోని పార్వతి (సుద్దిళ్ల) బ్యారేజీలో బుధవారం గోదావరి నదిలో వరద ఉధృతి పెరిగింది. ఎగువన ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తి వేయడంతో పై నుంచి భారీ వరద నీరు దిగువన ఉన్న పార్వతి బ్యారేజీ లోకి వచ్చి చేరుతుంది, అయితే బ్యారేజీలో 74 గేట్లు ఎత్తి ఉండటంతో 4 లక్షల 92 వేల క్యూసెకుల గోదావరి నది వరద నీరు దిగువకు విడుదల అవుతుంది. వరద నీటి ప్రవాహం పెరిగితే మళ్లీ పంట పొలాలు మునిగి పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి: శ్రీ రాజరాజేశ్వర జలాశయనికి(మిడ్ మానేరు) ప్రాజెక్టు బుధవారం 9500 ఇన్‌ఫ్లో కొసాగుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 4500 మానేరు, ములవాగు ద్వారా 5000 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. దిగువకు రెండు గేట్ల ద్వారా 7000 క్యూసెక్కులు ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3200, ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318మీటర్లకు ప్రస్తుతం 317.88 ఉండగా, సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.248 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 3.25 టీఎంసీల నీరు

ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఒక పంపు ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.25 టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా వస్తున్న 3200క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న 11వ ప్యాకేజీలోని రంగనాయకసాగర్‌కు 3300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎల్ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో ఎల్ఎండి 6గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటిమట్టం 24.034టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.645టీఎంసీల నీరునిల్వ ఉంది. మోయతుమ్మెద వాగు నుంచి 12,409క్యూసెక్కులు, మిడ్‌మానేరు నుంచి 6వేల క్యూసెక్కులు, ఎగువ కాకతీయకాలువ నుంచి 1400 క్యూసెక్కుల నీరు మొత్తం 19,809క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. 6గేట్ల నుంచి 12వేల క్యూసెక్కులు, కాకతీయకాలువ నుంచి 4వేల క్యూసెక్కులు, మిషన్‌భగీరథ, నీటి ఆవిరిరూపంలో 309 క్యూసెక్కుల నీరు మొత్తం 16,309 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో కొనసాగుతోంది.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దినోత్సవాన్ని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండా ఎగురవేసి నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతకాన్ని ఎగురవేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, పోలీస్‌స్టేషన్‌లో సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ శ్రావణ్ కుమార్, ఎంపీడీఓ దివ్యదర్శనరావు, మున్సిపాలిటీలో కమిషనర్ రమేష్ జాతీయ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో మనోహర్, కందునూరి పోచం, శ్రీనివాస్ గౌడ్, అమీనుద్దిన్, మల్లయ్య పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలతోపాటు అన్ని గ్రామాల్లో ప్రజాపాలన వేడుకలను నిర్వహించారు. తహసీల్దార్ యాకయ్య, ఎంపీడీవో భాస్కర్‌రావు జెండా ఎగురవేశారు. డీటీ గిరి, ఎంపీఓ కిరణ్, ఏపీఎం గీతా, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): కార్యాలయాలు, పాఠశాలల్లో జెండా ఎగరవేసి స్వీట్లు పంచుకున్నారు. ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ సారయ్య గౌడ్, తహసీల్దార్ జగదీశ్వర్ రావు, ఎంపీడీఓ పూర్ణచందర్‌రావు, ఎంఈఓ సిరిమల్ల మహేష్, డాక్టర్ శ్రీనివాస్, ఏపీఎం లవ కుమార్, ఎంపీఓ ఆరీఫ్ హుస్సేన్, సీఈఓ కోలేటి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి ప్రేమ్ కుమార్‌తోపాటు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సదయ్య, నాయకులు సబ్బని రాజమల్లు, ఎనగంటి రవి, అల్లం దేవేందర్, పొన్నమనేని దేవేందర్ రావు, ఆరెల్లి రమేష్, మాదాసు సతీష్, ఉప్పుల శ్రవణ్ కుమార్, పాల్గొన్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. తహసీల్దార్ స్వర్ణ, ఎంపిడివో పద్మజ, ఎస్‌ఐ సనత్‌కుమార్, వ్యవసాయ మార్కెట్‌లో చైర్మెన్ గండు సంజీవ్, లైబ్రేరియన్ మౌళి, పంచాయతీల్లో కార్యదర్శులు జాతీయజెండాను ఎగురవేశారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ఏ సాంబశివరావు తెలంగాణ తల్లి చిత్రపటానికి, మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులు శృతి, వైశాలి, రాజాంజలి బృందం ఆలపించిన తెలంగాణ గీతాలాపన ఉత్తేజాన్నిచ్చింది.


జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

మంథని, (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దినోత్సవం పురస్కరించుకొని ఆర్డీవో సురేష్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, తహసీల్దార్ కుమార స్వామి, ఎంపీడీవో శశికళ జెండావిష్కరించారు. బీజేపీ నేతలు, ఆయా కార్యాలయాలు, విద్యా సంస్థల వద్ద జెండా ఎగురవేశారు. తెలంగాణ విముక్తి కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను కొనియాడారు. వారికి నివాళులర్పించారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ప్రజాపాలన వేడుకలను నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఇంచార్జ్ ఉదయ్‌కుమార్ జెండా ఆవిష్కరణ చేశారు. ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ లావుడ్య రూప్లానాయక్ జెండా ఆవిష్కరించారు. అంబేడ్కర్ కూడలిలో బీజేపీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు తీగుళ్ల సతీష్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యాలయంలో సెక్రటరీ రవికిరణ్ జెండాను ఆవిష్కరించారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామపంచాయతీల్లో ప్రజాపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. తహసీల్దార్ సుమన్ జాతీయ జెండాను ఆవిష్కరించి వాణి పాఠశాలకు చెందిన విద్యార్థులకు నోట్‌బుక్కులను పంపిణీ చేపట్టారు. ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, ఎంఈవో కార్యాలయాల్లో ఎంపీడీవో శైలజారాణి, ఎస్‌ఐ శ్రీనివాస్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మారెల్లి రాజిరెడ్డి, సాగంటి శంకర్, చాట్ల సదానందం, దేవనపల్లి చక్రపాణి, తిరుపతిరెడ్డి, అనుము రాములు, సారయ్య నాయక్, అవినాష్, రాకేష్ పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజాపాలన వేడుకలను నిర్వహించారు. తహసీల్దార్ ధీరజ్ కుమార్, ఎంపీడీవో తిరుపతి, ఎస్‌ఐ రమేష్, డాక్టర్ సహబాజ్ ఖాన్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ చీకట్ల మొండయ్య, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, మాజీ ఎంపిటిసి సభ్యులు బోడకుంట స్వామి, శంకర్, అంబాల కొమురయ్య, నాయకులు రెడ్డి రజినీకాంత్, కుమారస్వామి, పిట్టల నర్సింగం, వంగ రాజమల్లు, వంగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్, (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం వేడుకలను ప్రభుత్వ కార్యాలయాలతోపాటు, పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్, తహసీల్దార్ కార్యాలయంలో రాజయ్య జాతీయ జండాలు ఎగురవేశారు.

సింగరేణిలో...

రామగిరి, (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3,ఏపీఏ డివిజన్ పరిధిలోని జీఎం కార్యాలయంలో బుధవారం ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. ఏపీఏ జీఎం నాగేశ్వర్‌రావు, రామ్మోహన్, జనార్దన్, సుదర్శనం, ఐలయ్య, షబ్బీరుద్దీన్, నాయకులు కొటరవీందర్‌రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 జీఎం ఆఫీస్‌లో ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఏరియా అఫీషియేటింగ్ జీఎం ఎం రాముడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. డీజీఎం పర్సనల్ అరవిందరావు, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ మహేందర్, డీజీఎంలు మురళీ కృష్ణ, ధనుంజయ్, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా విశ్వకర్మ జయంతి


పూజలో పాల్గొన్న ఎంపీ వంశీకృష్ణ, గోదావరిఖనిలో ర్యాలీ

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్వర్ణకారసంఘ భవన అభివృద్ధికి ఎంపీ నిధుల నుంచి నిధులు విడుదల చేస్తానని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. బుధవారం స్వర్ణకారుల కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. స్వర్ణకారుల సమస్యలపై అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వివరించగా సానుకూలంగా స్పందించారు. ఎంపీ వంశీకృష్ణను సన్మానించారు. బులియన్ మార్కెట్‌పై స్వర్ణకారుల ఆవేదనను ఎంపీకి వివరించగా, విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటుకు పార్లమెంట్‌లో చర్చిస్తానని తెలిపారు. అనంతరం విశ్వకర్మ జయంతి వేడుకల్లో పూజలు చేశారు.

పెద్దపల్లిరూరల్, (ఆంధ్రజ్యోతి): అప్పన్నపేట, తుర్కలమద్దికుంట, రాగినేడు గ్రామాల్లో విశ్వబ్రాహ్మణులు విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. పలు ఆలయాల్లో కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. అప్పన్నపేటలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన యజ్ఞ మహోత్సవానికి అతిథిగా కాల్వశ్రీరాంపూర్ పాండవుల గుట్ట వేద పాఠశాల వ్యవస్థాపకుడు బసవత్తుల రాజమౌళి ఆచార్యులు పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విశ్వకర్మ పతాకాన్ని ఆవిష్కరించి, స్వీట్లు పంచుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివపల్లి రాజేశం, మండల అధ్యక్షుడు తాటికొండ అనిల్ చారి, మండల ఉపాధ్యక్షుడు సత్యనారాయణ చారి, గ్రామ అధ్యక్షుడు కృష్ణచారి, నాయకులు మడుపు ఆనందచారి, కోటగిరి అనిల్ కుమార్, గర్రెపల్లి రాజేశం, సుల్తాన్‌పూర్ గ్రామాధ్యక్షుడు సురేందర్, కోటగిరి మురళి, పాల్గొన్నారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీలో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. ఎన్టీపీసీ తెలంగాణ ప్లాంట్ ఆవరణలో ప్రత్యేక పూజలు చేశారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని హోమాన్ని నిర్వహించారు. రామగుండం, తెలంగాణ ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్ సామంత, వివిధ విభాగాల జీఎంలు ముకుల్ రాయ్, మీనేష్ అగర్వాల్, అవిజిత్‌దత్తా, విజయ్ జోస్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు బొజ్జ రాజసాగర్ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి నిర్వహించారు. విశ్వకర్మ భగవాన్‌కు పూజా కార్యక్రమాలు చేసి, ప్రసాద వితరణ చేశారు. ప్రధాన కార్యదర్శి తాటికొండ రవి, సంఘం అధ్యక్షుడు సంగోజు చారి, నరసింహచారి, వేణు, సత్యం, సంపత్, లింగాచారి, కుమారస్వామి పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): వేణుగోపాల స్వామి ఆలయ ఆవరణలో విరాట్ విశ్వకర్మ యజ్ఞమహోత్సవం నిర్వహించారు. నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం మాజీ అధ్యక్షుడు చిలుమోజు వీరనారాయణ చార్యులు విశ్వకర్మ భగవానుడి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. సంఘ నాయకులు వీరాచార్యులు విశ్వకర్మ పతాకవిష్కరణ చేశారు. పూసాల ఆంజనేయులు, దాసోహం వెంకటేశ్వర్లు, అంజనేయులు, జూపాక కుమారస్వామి, సదానందం, సంపత్, గోపాల్, లక్ష్మీనారాయణ, కృష్ణమాచారి, చంద్రసేన పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ ఏరియా స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ యజ్ఞమహోత్సవ వేడుకలు నిర్వహించారు. స్వతంత్రచౌక్‌లో విశ్వకర్మ యజ్ఞమహోత్సవ పూజలు నిర్వహించారు. స్వర్ణకార సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కొండపర్తి నరహరి, కట్ట నగేష్‌కుమార్ జెండావిష్కరణ చేసి మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్వతంత్ర చౌక్ నుంచి లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్ మీదుగా చౌరస్తా మీదుగా కొనసాగింది. మాజీ కార్పొరేటర్లు తిరుపతి, బాలరాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ జయంతి సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అర్చనలతోపాటు హోమం నిర్వహించారు. విశ్వకర్మను దర్శించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి శోభాయాత్రను నిర్వహించారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ సెంటినరీకాలనీలో బీఎంఎస్ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి జరుపుకున్నారు. కార్యాలయం ఎదుట కాషాయం జెండాను ఆవిష్కరించారు. డిప్యూటీ జనరల్ సెక్రటరీ పొన్నమనేని వేణుగోపాల్‌రావు, కేంద్ర కార్యదర్శి మాదాసు రవీందర్, ఆర్జీ-3 ఏరియా ఉపాధ్యక్షుడు అరుకల ప్రసాద్, రమేశ్‌లు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం


జెండావందనం చేస్తున్న బీజేపీ నాయకులు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ చరిత్రను కాంగ్రెస్ పార్టీ వక్రీకరిస్తుందని తెలంగాణ తొలి దశ ఉద్యమ కారుడు మేరుగు హన్మంతుగౌడ్ అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా బుధవారం చౌరస్తాలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ విమోచన దినోత్సవాన్ని ప్రజాపాలన దినోత్సవం పేరుతో నిర్వహించడం హేయమైన చర్య అన్నారు. బీజేపీ నాయకులు కందుల సంధ్యారాణి, కోమళ్ల మహేష్, సంజీవ్‌కుమార్, భూమయ్య, పవన్, అపర్ణ, రమేష్, భాస్కర్, కోడూరి రమేష్ పాల్గొన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి సోమారపు లావణ్య ఆధ్వర్యంలో చౌరస్తాలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. పెద్దపల్లి రవీందర్, సుల్వ లక్ష్మీనర్సయ్య, మహవాది రామన్న, సోమారపు అరుణ్ పాల్గొన్నారు.

మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): గుంజపడుగులో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని స్వాతంత్ర్య సమరయోధుల సాఫల్య చిహ్నం వద్ద జరుపుకున్నారు. స్థూపానికి పూలమాలలు వేసి స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలను, వారి త్యాగాలను స్మరించుకుకొని నివాళులర్పించారు. టీఈఆర్‌సీ మెంబర్ శశిభూషణ్‌కాచే, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, కొండ శంకర్, ఊదరి శంకర్, వీకే. రవిలు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు కొయ్యడ సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జాతీయ జెండాను ఎగురవేశారు. మోదీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. మచ్చగిరి రాము, లక్ష్మీనారాయణ, మట్ట శంకర్, అజయ్, పాల్గొన్నారు.

జూలపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో తెలంగాణ విమోచన దినం పురస్కరిం చుకుని జాతీయా జెండాను ఎగురవేశారు.

స్వచ్ఛత హీ సేవలో అందరూ భాగస్వాములు కావాలి


వార్డు ఆఫీసర్లతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో అక్టోబరు 2వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కమిషనర్ అరుణ శ్రీ పేర్కొన్నారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్పొరేషన్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రెండు వారాల పాటు స్వచ్ఛతపై అవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు. అనంతరం చౌరస్తాలో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. డీసీ వెంకటస్వామి, ఏసీ వెంకటేశ్వర్లు, సెక్రటరీ ఉమా మహేశ్వరావు, ఈఈ రామన్, అకౌంట్స్ ఆఫీసర్ రాజు, టీపీఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, ఆర్‌ఐ శంకర్‌రావు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసిన వారికి జరిమానా

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా విధించాలని కమిషనర్ అరుణశ్రీ వార్డు ఆఫీసర్లకు సూచించారు. రెవెన్యూశాఖకు బదిలీ అయిన వార్డు ఆఫీసర్ల స్థానంలో ఇతర సిబ్బందిని నియమించారు. పారిశుధ్య నిర్వహణ సమర్థవంతంగా జరగాలన్నారు. ఆస్తి పన్ను, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్‌లు వసూలు చేయాలన్నారు. అడిషనల్ కమిషనర్ మారుతి ప్రసాద్, ఆర్‌ఐలు శంకర్‌రావు, ఖాజా, వార్డు అధికారులు పాల్గొన్నారు.

రామగిరి (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్‌రావులు ప్రారంభించారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు అక్టోబరు2 వరకు సింగరేణి వ్యాప్తంగా కొనసాగిస్తామని జీఎంలు ప్రతిజ్ఞ చేశారు. సంతోష్, కొటరవీందర్‌రెడ్డి, యాదయ్య, రామ్మోహన్, రాజారెడ్డి, సుదర్శనం, జనార్ధన్‌రెడ్డి, రాజేంద్రకుమార్, సురేఖ, ఐలయ్య, షబ్బీరుద్దీన్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): బొగ్గు మంత్రిశాఖ ఆదేశాల మేరకు ఆర్జీ-2 ఏరియాలో స్వచ్ఛతాహీసేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. జీఎం ఆఫీస్‌లో ఏరియా అఫీషియేటింగ్ జీఎం ఎం రాముడు ఉద్యోగులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. ఎన్విరాన్‌మెంట్ ఆఫీసర్ సురేష్‌బాబు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సంతోష్‌కుమార్, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ మహేందర్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గంలో చోటు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గోదావరిఖనికి చెందిన కోమళ్ల మహేష్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఉత్తర్వులను జారీ చేశారు. 2010లో యువ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా, 2014లో రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన మహేష్‌కు జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి అప్పగించారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన గర్రెపల్లి నారాయణ స్వామిని జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి బుధవారం నియామకం ఉత్తర్వులను జారీ చేశారు.

దేశ ప్రగతికి దిక్సూచి ప్రధాని మోదీ


కాలనీలో మోదీ మాస్కులతో బీజేపీ నాయకులు, మంథనిలో రోగులకు పండ్లు పంపిణీ

మంథని, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ దేశానికి దిక్సూచిలా వ్యవహరిస్తున్నారని బీజేపీ నేత చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. మోదీ పుట్టిన రోజు సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సునీల్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. విశ్వకర్మ జయంతి ఉత్సవంలో పాల్గొన్నారు. బోగోజు శ్రీనివాస్, నాంపల్లి రమేష్, రాపర్తి సంతోష్, చిలువేరి సతీష్, సంతోష్ పాల్గొన్నారు.

మార్కండేయకాలనీ, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలకు మోదీ ఆదర్శంగా నిలిచారని బీజేపీ జిల్లా కార్యదర్శి సోమారపు లావణ్య అన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా కోదండ రామాలయంలో పూజలు నిర్వహించి చౌరస్తాలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. లక్ష్మీనర్సయ్య, సోమారపు అరుణ్, పెద్దపల్లి రవీందర్, అపర్ణ, సారంగపాణి, కిషన్‌రావు, సురేష్, పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ బర్త్‌డేను కాలనీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలంగాణ చౌరస్తాలో కేక్ కట్ చేశారు. మోదీ ఫేస్ మాస్కులు ధరించి చాయ్ పంపిణీ చేశారు. శశికుమార్, మూకిరి రాజు, మారెపల్లి శ్రీనివాస్, బద్రి దేవేందర్, ఆకుల కుమార్, బాదె క్రాంతి, ప్రణీత్, పాష, అనిల్, గట్టు శ్రీనివాస్, శివాజీ పాల్గొన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా 16వ డివిజన్‌లో అధ్యక్షుడు శశికుమార్ పతాకాన్ని ఆవిష్కరించారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్ నిర్వహించారు. మండల కేంద్రంలో మొక్కలు నాటారు. సంతోష్‌రెడ్డి, ఐలయ్య, మల్లెత్తుల ఆంజనేయులు, సంపత్ పాల్గొన్నారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ప్రధాని పేరు మీద పూజ నిర్వహించి, ఆలయ పరిసరాల్లో కేక్ కట్ చేశారు. శ్రీనివాస్, రేణుకాదేవి, తీర్థాల కుమారస్వామి, సారంగం, రాజేంద్రప్రసాద్, చందు పాల్గొన్నారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను ధర్మపురి నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ కన్నం అంజయ్య నిర్వహించారు. మండల అధ్యక్షుడు తీగుళ్ల సతీష్‌రెడ్డితో కలిసి అంబేడ్కర్ కూడలిలో కేక్ కట్ చేశారు. అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గుజ్జుల వేణుగోపాల్‌రెడ్డి, కిరణ్, శ్రీనివాస్, దేవి రాజలింగు పాల్గొన్నారు.

తెలంగాణకు స్వేచ్ఛ, సమానత్వం కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణకు స్వేచ్ఛ, సమానత్వం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా బుధవారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, హోంమంత్రి సర్దార్ వల్లాభాయ్ పటేల్ ఆపరేషన్ పోల్ ద్వారా తెలంగాణను నిజాం పాలకుల కబంధ హస్తాల నుంచి విముక్తి చేశారన్నారు. ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక పథకాలను ప్రవేశ పెడుతున్నారన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో పెద్దెల్లి ప్రకాష్, గట్ల రమేష్, బొమ్మక రాజేష్, ముస్తాఫా, ఫజల్ బేగ్, దాసరి విజయ్, గడ్డం శేఖర్, బాబుమియా, స్వప్న, శాంతి, గుంపుల తిరుపతి, అనుమ సత్యానారాయణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన

మంథని, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఇంటి ఎదుట కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ధర్నా, అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ అంబేద్కర్ చౌక్‌లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు బుధవారం ధర్నా, రాస్తారోకో చేశారు. పెంచికల్‌పేటలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ, మధు ఇంటి ఎదుట ధర్నా సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేతలు వ్యవహరించిన తీరును ఖండించారు. మంత్రి శ్రీధర్‌బాబు, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు కాంగ్రెస్ పార్టీ నేతల తీరుకు వత్తాసు పలుకుతూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్ గౌడ్, నేతలు తగరం శంకర్‌లాల్, మాచీడి రాజుగౌడ్, కనవేన శ్రీనివాస్, గొబ్బూరి వంశీ, పుప్పాల తిరుపతి, ముబ్బు ఓదమ్మ, అడిచర్ల సమ్మయ్య, లక్ష్మణ్, కుమార్ పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ మండలం పెంచికలపేట్‌లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం తప్పా అని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శంకేషి రవీందర్ ప్రశ్నించారు. టిటూ సెంటర్‌లో అంబేద్కర్, జ్యోతిరావుపూలే విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఇంటి పై దాడి చేయడాన్ని ఖండించారు. నాయకులు మ్యాదరవేని కుమార్‌యాదవ్, భాస్కర్, గాజుల ప్రసాద్, రొడ్డ శ్రీనివాస్, గద్దలశంకర్, అశోక్, శేఖర్, సదానందం, పోచం, మహేష్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్‌కు ప్రాణహాని ఉందని బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. మంథనిలో ఆయన ఇంటి ముట్టడిని నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. పుట్ట మధుకర్‌కు ఏమైనా జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. శంకర్, రాజేశ్వరి, చిందం తిరుపతి, లక్ష్మిరవి, ఉప్పరి శ్రీనివాస్, భూమయ్య, లక్ష్మిమల్లు ఉన్నారు.

అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన

(5వ పేజీ తరువాయి)

యార్డ్ వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీని 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచామన్నారు. 23 కోట్ల 75 లక్షలతో గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో 50 పడకల క్రిటికల్ కేర్ యూని ట్, 51 కోట్లతో పెద్దపల్లిలో 100 పడకల ఆసుపత్రి, 22 కోట్లతో మంథనిలో 50 పడకల ఆసుపత్రి భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌తో సామాజిక తెలంగాణ సాధనకు కృషి చేస్తున్నామని రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఓబేదుల్లా కోత్వాల్ సాహెబ్ అన్నారు. జిల్లా అభివృద్ధికి, పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మె ల్యే చింతకుంట విజయరమణారావు, జిల్లా గ్రంథా లయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, అదనపు కలెక్టర్లు జె అరుణశ్రీ, డి వేణు, డీసీపీ కరుణాకర్, ఆర్డీఓ గంగయ్య, పెద్దపల్లి, సుల్తానాబాద్ మార్కెట్ కమిటీల చైర్మన్లు ఈర్ల స్వరూప, మినుపాల ప్రకాశ్ రావు, జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన జడ్జి


వృద్ధురాలితో మాట్లాడుతున్న జడ్జి భవాని

మంథని, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సీనియర్ సివిల్ జడ్జి వీ. భవాని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. అందుతున్న సేవలు, సౌకర్యాలను, మందులను, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డిని ఆదేశించారు.

ఖనిలో భారీ వర్షం

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షం కురుస్తోంది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. అర్ధరాత్రి నుంచి 2సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. బుధవారం మధ్యాహ్నం అరగంట పాటు భారీ వర్షం కురువడంతో కళ్యాణ్‌నగర్, చౌరస్తా, మార్కెట్, తిలక్‌నగర్, విఠల్‌నగర్, గాంధీనగర్ రహదారులు జలమయమై పాదచారులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం కూడా వర్షం కురిసింది. దీంతో ప్రధాన నాలాలు పొంగిపొర్లాయి.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

ఎలిగేడు, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ఎలిగేడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని మీనుగు భూలక్ష్మి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం గంగ్ర దేవేందర్ రావు తెలిపారు. ఈ నెల 14న జిల్లా కేంద్రంలోని ట్రినిటి ప్రైమరీ స్కూల్ జరిగిన సబ్ జూనియర్ కబడ్డీ సెలక్షన్స్‌లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 25న నిజామాబాద్‌లో జరిగే పోటీల్లో భూలక్ష్మి ఆడనున్నది. ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ కన్న ప్రణయ్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్ రావు, బూర్ల వెంకటసత్యం, కప్పల ప్రవీణ్ అభినందించారు.

లాంగ్ జంప్‌లో అభిలాష్ ప్రథమ స్థానం


విద్యార్థిని అభినందిస్తున్న టీచర్

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గుడ్ షెపర్డ్ పాఠశాల విద్యార్థి అభిలాష్ లాంగ్‌జంప్‌లో ప్రతిభ కనబరిచాడు. అండర్ 14లో డివిజన్ స్థాయిలో ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపాడు. 7వ తరగతి చదు వుతున్న అభిలాష్ పెద్దపల్లిలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో ప్రథమ బహు మతి సాధించగా బుధవారం విద్యార్థికి పుష్పగుచ్ఛం అందించి ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

నిరంతర శ్రమతోనే మంచి ఫలితాలు

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిరంతర శ్రమిస్తేనే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. యువతీ యువకులకు సబ్ ఇన్స్పెక్టర్, పోలీస్ కానిస్టేబుల్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులకు ఎంపికయ్యే విధంగా రాత పరీక్షలో శిక్షణ ఇచ్చేందుకు కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని బుధవారం కలెక్టర్ పరిశీలించారు. అభ్యర్థులకు అందిస్తున్న శిక్షణ, వసతుల వివరాలను తెలుసుకున్నారు. అభ్యర్థులు అగ్నివీర్‌లో ఉద్యోగాలు సాధించాలని సూచించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, శిక్షణ అధ్యాపకులు పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరు

పెద్దపల్లి, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి, ఎలిగేడు, సుల్తానాబాద్, పెద్దపల్లి మండలాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు హైలెవెల్ వంతెనల నిర్మాణాలకు పంచాయతీ రాజ్ శాఖ ద్వారా 5 కోట్ల రూపాయలు మంజూరైనట్లు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి నుంచి మీర్జంపేటకు వెళ్లే దారిలో నక్కలవాగుపై వంతెన నిర్మాణానికి కోటి 25 లక్షలు, జూలపల్లి మండలం కీచులాటపల్లి నుంచి వడ్కాపూర్‌కు వెళ్లే దారిలో చెరువు మత్తడి వద్ద వంతెన నిర్మాణానికి 50 లక్షల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. రంగాపూర్ నుంచి రాఘవాపూర్ రోడ్డులో ఎగుళ్ల ఏరియాలో వంతెన నిర్మాణానికి ఒక కోటి, జాలు కాలువ వద్ద వంతెన నిర్మాణానికి 50 లక్షలు, శివపల్లి నుంచి నర్సయ్యపల్లి రోడ్డులో శివపల్లి ఒర్రె చెరువు కాలువపై హైలెవెల్ వంతెన నిర్మాణానికి 85 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కకు, జిల్లా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు

మంథనిరూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 5 ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ విద్య బోధించేందుకు 5 ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను అధికారులు ప్రకటించారు. మండలంలోని గాజులపల్లి, తోటగోపయ్యపల్లి, మల్లారం, కూచిరాజ్‌పల్లి పాఠశాలల్లో బోధించేందుకు ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు సంబంధిత స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ లకు ఈ నెల 21 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేత్రదాన అంగీకార పత్రం అందజేత

రామగిరి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): లద్నాపూర్ గ్రామానికి చెందిన బర్లశ్రీనివాస్ కుటుంబ సభ్యులు పది మంది నేత్రదానానికి లయన్స్‌క్లబ్‌కు అంగీకారపత్రం అందజేశారు. బర్లశంకర్ సంవత్సరీకం సందర్భంగా ఆయన స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతీకి నేత్రదాన పత్రాలను అందజేశారు. సదాశయ ఫౌండేషన్ ఇన్‌చార్జి నూక రమేష్ ప్రశంస పత్రాలను అందజేశారు. మాజీ జెడ్పిటీసి చొప్పరి సదానందం, మాజీ ఎంపీపీ చంద్రయ్య, ఆరెల్లిదేవక్క కొంరయ్య, నాయకులు ముస్త్యాలశ్రీనివాస్, బుచ్చన్న పాల్గొన్నారు.

రెవెన్యూ క్లస్టర్లకు జీపీవోల నియామకం

మంథనిరూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉన్న 35 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సేవలను అందించడానికి జీపీవోలు (గ్రామ పరిపాలన అధికారులు)ను వారికి కేటాయించిన క్లస్టర్లల్లో నియామించినట్లు అధికారులు తెలిపారు. 35 రెవెన్యూ గ్రామాలకు 13 క్లస్టర్లుగా విభజించి క్లస్టర్‌కు ఒకరి చొప్పున జీపీవోలను కేటాయించారు.